క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంగన్న

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంగన్న కోరారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జిల్లా సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదోన్నతులను పొందిన వారికి ఇంక్రిమెంట్లు ఆధారంగా పేస్కేల్‌తో కొత్త జీతాలు ఇవ్వాలని, 12వ పీఆర్‌సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న మహిళలకు భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవికుమార్, కౌన్సిలర్ పాండు రంగారెడ్డి, నరసింహులు, జిల్లా బాధ్యులు తిక్కస్వామి, పాపన్న, సుబ్బారెడ్డి,ఖాసిం, ప్రసాద్, వీరేష్ పాల్గొన్నారు.

శ్రీ మఠంలో భీమనకట్టె పీఠాధిపతి



హారతులిస్తున్న పీఠాధిపతి రఘువరేంద్రతీర్థులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు భీమనకట్టె పీఠాధిపతి రఘువరేంద్రతీర్థులు ఆదివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు వీరికి శ్రీ మఠం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

మహిళలు స్వావలంబన సాధించాలి



శిక్షణ కార్యక్రమంలో సర్పంచ్ భీమయ్య, మహిళలు

మంత్రాలయం రూరల్: మహిళలు స్వావలంబన సాధించాలని మంత్రాలయం గ్రామ సర్పంచ్ భీమయ్య సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉడిపికి చెందిన సుమేధ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టులో వివిధ రకాల డిజైన్లపై ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ శిక్షణను భీమయ్య ప్రారంభించారు. నిర్వాహకురాలు సాధన జి అస్రిత ఫ్యాషన్ డిజైన్‌పై మహిళలకు అవగాహన కల్పించారు.

లింగసూగురుకు వెళ్లి పింఛన్ పంపిణీ



దాసరి లక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న చాకలి నరసింహులు

మంత్రాలయం రూరల్: మాధవరం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ లింగసూగూరులో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లి చికిత్స పొందుతోంది. చేయి, కాలు పూర్తిగా పనిచేయకపోవడంతో మంచానికే పరిమితమైంది. విషయం తెలుసుకున్న గ్రామం వలంటీర్ చాకలి నరసింహులు అక్కడికి వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము అందజేశాడు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



సామూహిక మంగళహారతి పూజల్లో పాల్గొన్న మహిళలు

ఆదోని అర్బన్ : గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం పట్టణంలోని వైఎంకే నగర్‌లో వెలిసిన సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులు బాబాకు సామూహిక మంగళహారతి ఇస్తూ విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ సేవా సమితి ప్రెసిడెంట్ డీవీవీ ప్రసాద్, సెక్రటరీ టీజీ రాంప్రసాద్, వీరస్వామి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

కోసిగి: స్థానిక సిద్దరూఢ ఆశ్రమంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు జేరుబండి నరసింహులు, గానిగి వీరారెడ్డి, ముకుంద క్రిష్ణమూర్తి, అరికేర వీరరాజులు ఆదివారం తెలిపారు. వేకువజాము నుంచి ఆశ్రమంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపిస్తామన్నారు.

ఈ ఫొటోలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నుంచి ధ్రువ పత్రం అందుకుంటున్న విద్యార్థిని పేరు నాగలక్ష్మి. ఈమెది శక్తిగుడి గ్రామం. 'గతంలో ఆదాయ, కుల ధ్రువ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ 15 రోజులు తిరిగినా అందేవి కాదు. శనివారం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో గంటలోపే రెండు ధ్రువ పత్రాలు అందజేశారు. ఇందుకు అవసరమైన పత్రాలను వలంటీర్లు ఇంటికొచ్చి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే నుంచి అవసరమైన ధ్రువ పత్రాలు అందుకోవడం సంతోషంగా ఉంద'ని చెబుతోంది.



ఈ చిత్రంలో ధ్రువ పత్రం చూపుతున్న ఈమె పేరు చంద్రమ్మ, దొడ్డి గ్రామం. 'మా మనవడు ప్రదీప్ ఆలూరులోని హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. వాడికి ఆదాయ, కుల ధ్రువ పత్రాలు తీసుకురావాలని బడిలో సారోళ్లు చెప్పారంట. దీంతో మాకు సమాచారమిచ్చాడు. మేం గ్రామంలోని వలంటీరును సంప్రదించగా, అందుకు అవసరమైన సర్టిఫికెట్లను ఇంటికొచ్చి తీసుకొని వెళ్లాడు. శనివారం ఆదాయ, కుల ధ్రువ పత్రాలను ఇంటికే తీసుకొచ్చి అందజేశాడు. రెండు రోజుల్లోనే సర్టిఫికెట్లు అందజేయడం సంతోషకరం'.



చేనేతలకు చేయూత

- జగనన్న నేస్తం కింద ఏటా రూ. 24వేలు
- 280 మందికి నాలుగేళ్లుగా పథకం వర్తింపు



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు



చేనేత మగ్గం

ఆదోని సెంట్రల్: ఒకప్పుడు చేనేత వస్త్రాలకు మంచి డిమాండ్ ఉండేది. నూతన యంత్రాలు, డిజైన్లు, ఆధునిక పద్ధతుల్లో త్వరగా తయారు చేస్తుండటంతో చేనేతలు మనుగడ కోల్పోయారు. అయినా కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ పలు చేనేత వస్త్రాలకు ఆదరణ లభిస్తుంది. ముఖ్యంగా పట్టు చీరలు, నూలు పంచలు, టువాళ్లు తదితర వాటిని మగ్గంపై తయారు చేస్తున్నారు. మగ్గాలపై ఆధారపడి వందల మంది జీవనం సాగిస్తున్నారు. అయితే పెరిగిన ముడి సరుకుల ధరలు, మగ్గం నేసే వారు తగ్గిపోవడం, నైపుణ్యమున్న కార్మికులు ఇతర రంగాల వైపు వెళ్లిపోవడంతో మగ్గం మనుగడ కోసం పోరాటం సాగిస్తోంది. వారిని ఆదుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న నేస్తం పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం కింద వారికి ఆర్థిక సాయం అందజేస్తుండటంతో కొందరు వృత్తిని కొనసాగిస్తున్నారు. అలాగే జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకుంటున్నారు.

డివిజన్‌లో అధిక శాతం మగ్గాలు..

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల జనాభాలో దాదపు 12 శాతం మంది ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గత పాలకుల నిరాదరణకు లోనై కార్మికుల పరిస్థితి తిరోగమనంలో పడింది. ఆర్థికంగా చితికి పోయిన చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది జగనన్న నేస్తం కింద ఆర్థిక సాయం అందిస్తుంది. దీంతో కొంత మంది సొంతంగా మగ్గాలను ఏర్పాటు చేసుకొని చీరలను నేస్తూ అభివృద్ధి చెందుతున్నారు. ఆదోని డివిజన్‌లో ఆదోని,ఎమ్మిగనూర,నందవరం మండలాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. ఆదోని పట్టణంలో 280 కుటుంబాలు మగ్గం నేస్తారు. వారి కింద దాదపు 300 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. కంచి,పట్టు చీరలను నేసి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. జగనన్న నేస్తం కింద ప్రతి ఏటా ఒకరికి రూ.24వేల చొప్పున 280 మందికి అందిస్తుంది. ఇప్పటి వరకు రాష్ట్ర పభుత్వం నాలుగేళ్లలో రూ.2.69 కోట్లు వీరికి అందించింది.

సాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ..

ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో ఆర్థికంగా బలపడుతున్నారు. గతంలో మగ్గం ఏర్పాటు చేసుకోవాలంటే అప్పు చేయాల్సి వచ్చేది. చేతిలో మగ్గం ఉన్న ముడి సరకు కొనడానికి ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉండేవి. ప్రస్తుతం జగనన్న నేస్తం ద్వారా వచ్చిన సొమ్ముతో కొంత మేరకు ఆర్థిక ఇబ్బందులు తగ్గాయి. మరికొందరు మగ్గం స్ట్రక్చర్‌ను మరమ్మతు లు చేయించుకొని సొంతంగా చీరలు నేస్తున్నారు. జగనన్న నేస్తం ద్వారా వచ్చిన డబ్బులకు మరికొంత జమ చేసి పట్టణంలో దాదపు 50 మంది కొత్త మగ్గాలను ఏర్పాటు చేసుకున్నారు. దీనికి తోడు రకరకాల దారాలు, డిజైనింగ్ అట్టలను సమకూర్చుకొని కంచి, పట్టు, దర్మవరం చీరలను నేస్తున్నారు.

చీరల అల్లికలో శిక్షణ..

కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు చీరల అల్లికల్లో వివిధ రకాల డిజైన్లు, నైపుణ్యాలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. వీటి మీద మక్కువ కలిగిన వారు గుంటూరు, విజయవాడ వంటి నగరాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారు. ఆధునిక టెక్నాలజీ ఉన్నప్పటికీ భారీ యంత్రాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక స్తోమత లేక మామూల మగ్గంతోనే చీరలను నేస్తున్నారు. కంచి, పట్టు, ధర్మవరం వంటి చీరలను పది రోజులకు ఒక చీర నేస్తారు. కనుగ ఎక్కువ ఎగుమతి చేసుకోవడానికి చీరలు లేక పోయినా ఉన్న చీరలనే మాస్టర్ వీవర్స్ వచ్చి కొనుగోలు చేస్తారు. ధర్మవరం, గద్వాల ప్రాంతాల వారితో పాటు ఎమ్మిగనూరు, ఆదోని వస్త్ర దుకాణాల యజమానులు నేసిన చీరలను తీసుకెళ్తారు. మరికొందరు తామే ముడిసరుకు, డిజైన్లు ఇచ్చి చీరకు ఇంత మొత్తం అని చెల్లించి చీరలను నేయించుకుంటారు. ఎమ్మిగనూరు, కోడుమూరు, నందవరం గ్రామాల్లో కూడా చేనేత కార్మికులు ఈ వృత్తితోనే తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

ఉపాధిని మెరుగు పరుచుకుంటున్నాం

ఏటా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం ద్వారా ఉపాధిని మెరుగు పరుచుకుంటున్నాం. మేం మగ్గం సర్వీసింగ్ చేసి ఇస్తాం. అలాగే ముడి సరుకులు వంటివి కొనుగోలు చేసి కంచి, పట్టు చీరలను నేస్తాం. ఒక చీర నేయడానికి పది రోజులు పడుతుంది. అలా నెలకు మూడు చీరలు వరకు నేస్తాం. ముడిసరుకుల విలువ తీసివేయగా ఒక చీర్‌పై దాదాపు రూ.5వేల వరకు మిగులుతుంది.

– మల్లికార్జున, చేనేత కార్మికుడు, ఆదోని

ఆర్థికంగా ఆదుకుంటున్నారు



జగనన్న నేస్తం ద్వారా ప్రభుత్వం మాకు ఆర్థిక సాయం అందించి భరోసా కల్పిస్తుంది. గతంలో డిజైన్లు, ముడిసరుకులు కొనడానికి అప్పులు చేసేవాళ్లం. ఇప్పుడు అపరిస్థితి లేదు. ప్రభుత్వం అందించిన సాయంతో కొత్తకొత్త డిజైన్లు, ముడి సరుకులు కొనుగోలు చేసి మగ్గాలపై చీరలను నేస్తున్నాం. ఒక మగ్గం కింద ఇద్దరు కార్మికులు పనిచేస్తారు వారికి కూడా దీ పథకం వర్తింపజేస్తే బాగుంటుంది.

– బి.వెంకటేశ్ ఆదోని.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేయించుకునేందుకు క్యూలో నిల్చున్న మహిళలు

ఆదోని అర్బన్ : ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో కర్నూలు ప్రైమ్ ప్లస్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా రాచోటి సుధాకర్, విట్టా రమేష్, నగేష్, ప్రైమ్ ప్లస్ ఎండీ అజయ్‌కుమార్ డాక్టర్ గౌతమ్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 353 మంది సంతానలేమి దంపతులు పాల్గొని వైద్య పరీక్ష/ చేయించుకున్నారు. మెరుగైన టెస్టులు అయిన ఐయూఐ, సెమిన్ ఎనాలిసిస్ వంటి పరీక్షల కోసం కర్నూలుకు రెఫర్ చేస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. రాయలసీమలోనే మొట్టమొదటిసారిగా ఈ రకమైన ఉచిత వైద్య శిబిరాన్ని చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు మిర్యాల శ్రీధర్, ప్రతాప్, ఈరన్నశెట్టి, రంగనాయకులు, రాంప్రసాద్, రఘు, రాజగోపాల్, మహిళా అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు బూదూరు సంగీత, మమతాశ్రీ, హిమబిందు, గీత, కవిత, లావణ్య, సౌజన్య, తులసి, యశోద, విద్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి



పీఠాధిపతికి తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

హాలహర్వి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనలో మెలగాలని, భక్తిభావం కలిగి ఉండాలని పీఠాధిపతులు శ్రీ సద్గురు శివానందభారతి స్వాములు, శ్రీ సద్గురు విద్యానందభారతి స్వాముల వారు సూచించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని చాకిబండ గ్రామంలోని శివాలయంలో మాజీ సర్పంచ్ కె.లింగన్న ఆధ్వర్యంలో పీఠాధిపతులకు గ్రామపెద్దలు, గ్రామస్తులు తులాభారం నిర్వహించారు. పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ.. దేవుడి పట్ల భక్తి కలిగి ఉండాలని, మనస్సులో దేవుడిని స్మరించి కార్యాన్ని చేపడితే విజయం వరిస్తుందని చెప్పారు. నేటి సమాజంలో ఎన్నో ఒడిదుడుకులతో ప్రజలు జీవనం సాగిస్తున్నారని, ఆధ్యాత్మిక చింతన చేస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రజలు సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సీపీఐ నూతన కమిటీ ఎన్నిక

కోసిగి: సీపీఐ మండల నూత కమిటీని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా సహాయక కార్యదర్శి మునెప్ప , జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ సమక్షంలో ఆదివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శిగా ఎం.గోపాల్, సహాయ కార్యదర్శిగా ఓంకార్ స్వామి, ఎం.రాజు, ఏ.జీవన్, ఎస్.ఈరేష్, రాజేంద్ర, అబ్రహాం, సిద్దప్ప, లక్ష్మన్నలతో పాటు మరో 21 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నేడు గ్రామ సభ

కౌతాళం: స్థానిక మేజర్ పంచాయతీకి సంబంధించి సోమవారం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో 15వ ఆర్థిక సంఘం, ఎన్ఆర్ ఈజీఎస్, గ్రామ పంచాయతీ నిధుల నుంచి చేపడుతున్న పనుల గురించి చర్చిస్తామని చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నందవరం: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మయ్య హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మండలకేంద్రంలోని నాగలదిన్నె రోడ్డులోని వంక వద్ద నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించి అరెస్టు చేశారు. నిందితులు కే.పేట గ్రామానికి చెందిన మహాలింగప్ప, వీరేష్‌గౌడ్, హేమంత్‌గౌడ్‌తో పాటు నందవరం గ్రామానికి చెందిన మల్లికార్జునగౌడ్‌ను అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కొక్కరచేడులో అగ్ని ప్రమాదం

హాలహర్వి: మండలంలోని కొక్కరచేడు గ్రామంలో ఆదివారం చింతకుంట తిమ్మప్ప భార్య శాంతమ్మకు చెందిన గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు శాంతమ్మ వాపోయింది. దినసరి కూలీ అయిన శాంతమ్మ ఆదివారం కూలి పనికి వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గుడిసె కాలిపోయింది. స్థానికులు బక్కెట్లు, బిందెలతో నీటిని తీసుకొచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆర్థికంగా నష్టపోయిన బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ మన్మథ రెడ్డి, గ్రామస్తులు కోరుతున్నారు.

కరిడిగుడ్డంలో సప్త భజనలు

ఆలూరు: కరిడిగుడ్డం గ్రామంలో మహాయోగి, అవధూత మంగమ్మవ్వ దేవాలయంలో సప్త భజనలను ప్రారంభించినట్లు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, నిర్వాహకులు ఆదివారం తెలిపారు. గ్రామానికి సమీపంలోని భక్త భజన బృందం వారికి అవకాశం కల్పించినట్లు వారు తెలిపారు. ప్రజలందరికీ అవ్వ కటాక్షం కలగాలని కాంక్షిస్తూ భజనలను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు (రూరల్): విద్యార్థులు తైక్వాండో క్రీడలో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం నగరంలోని పార్థసారథి నగర్‌లోని వైఎస్సార్ పార్క్‌లో తైక్వాండో బెల్ట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమకు ఇష్టమైన క్రీడలో రాణించాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి ఆరెంజ్, ఎల్లో బెల్ట్‌లను ప్రదానం చేశారు.

అలరించిన గాతరహే మేరదిల్

కర్నూలు కల్చరల్: హైదరాబాద్, బెంగళూరు కళాకారులతో నిర్వహించిన 'గాతరహే మేరదిల్' కార్యక్రమం అలరించింది. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు ఆలపించిన పాటలు హుషారెత్తించాయి.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ఆదోని సెంట్రల్: మండలంలోని అయా గ్రామాల్లోని లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ ఎం.రవికుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని అయా గ్రామాలకు 1,696 ఇళ్లు మంజూరయ్యాయని,పెద్దతుంబళం గ్రామంలో 212 ఇళ్లు మంజూరు కాగా 196 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. మదిరె గ్రామంలో 80 ఇళ్లు మంజూరు కాగా అందరూ పనులు చేపట్టారన్నారు. నాగలాపురం,బైచిగేరి, అరెకల్లు, పెద్దహరివాణం వంటి గ్రామాల్లో పనులను చేపడుతున్నట్లు వివరించారు. కొందరు ఆర్థిక పరమైన ఇబ్బందులతో నిర్మాణంలో జాప్యం చేస్తున్నారని, వారిని కూడా ప్రోత్సహించి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయిలోని వర్క్‌ఇన్స్‌పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

2,158 మంది రైతులకు పంటల బీమా

ఆదోని టౌన్ : నియోజకవర్గంలో గతేడాది ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఇందులో పంటల దిగుబడి ఆధారిత పంటలబీమా పథకం కింద 2,158 మంది రైతులను ఎంపిక చేసిందని మండల వ్యవసాయ అధికారి అశోక్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. 2,158 మంది రైతులు 2,80,091.712 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని చెప్పారు. పంటల బీమా పథకం కింద రూ.1.52 కోట్లు త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారని చెప్పారు. రైతులు సంబంధిత అధికారులు, వలంటీర్లను కలిసి తప్పులు ఏవైనా ఉంటే సవరించుకోవాలని సూచించారు.

పంటల బీమా మంజూరు

మంత్రాలయం రూరల్: మండలానికి 2022 ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు రూ.3.50 కోట్ల పంటల బీమా మంజూరైందని వ్యవసాయ అధికారి జీరా గణేష్ తెలిపారు. అర్హుల జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శనకు ఉంచామని చెప్పారు. వాతావరణ ఆధారిత బీమా కింద 9,295 మంది రైతులకు గాను 22,502.5 ఎకరాలకు మంజూరైంద న్నారు. పేర్కొన్నారు. పంటల దిగుబడి ఆధారంగా 1,098 మంది రైతులకు 1,002.42 ఎకరాలకు గాను రూ.45,24,076, పత్తి, జొన్నలు, ఉల్లి, వేరుశనగ పంటలకు బీమా మంజూరైనట్లు వివరించారు.

కేసు నమోదు

మంత్రాలయం రూరల్: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో ఆస్తి తగాదాలో భాగంగా కురవ రామలింగప్పకు చెందిన గుడిసె స్థలం తమదంటూ లక్ష్మన్న, యల్లమ్మ ఆయన గుడిసెను తొలగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు.

ఉప్పరహాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

కౌతాళం: మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏకాంబర్‌రెడ్డి, సర్పంచ్ తులసీ ఆధ్వర్యంలో కర్నూల్ అమీలియా ఆసుపత్రి వైద్యులు ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి అద్దాలు అవసరం కాగా, 25 మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. వీరికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. అలాగే అద్దాలను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. త్వరలోనే ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



గుడేకల్ నుంచి గంధంను తీసుకొస్తున్న ఆస్థాన పీఠాధిపతులు



శరీరానికి కడ్డీలు గుచ్చుకొని గంధం ఊరేగింపులో పాల్గొన్న భక్తుడు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీ బాబా ఫరీద్ దర్గా 14వ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గంధోత్సవ ఊరేగింపు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గుడేకల్ గ్రామంలోని ఫకీర్ సర్దార్ చౌక్ బాబా ఫరీద్ దర్గా నుంచి గంధంకు ప్రార్థనలు చేసిన తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వహకులు నూర్‌బాబా, హుసేన్‌బాబా, సర్ఫరాజ్‌బాబా మాట్లాడుతూ.. గంధంను పురవీధుల గుండా ఊరేగింపుగా బాబాఫరీద్ సంస్థానానికి తీసుకెళ్తామని, రాత్రి ఖవ్వాలి ఉంటుందని చెప్పారు. సోమవారం ఉరుసు మహోత్సవం ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రతో పాటు ఇతర దేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరవుతాయని తెలిపారు. రెండు రోజుల పాటు రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముగిసిన వరుణయాగ పూజలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం



పాల్గొన్న తప్పెట రామిరెడ్డి దంపతులు తదితరులు

హొళగుంద: రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన దేవరగట్టు శ్రీమాళ మల్లేశ్వరస్వామి సన్నిధిలో గత నెల 30వ తేదీ నుంచి జరుగుతున్న వరుణయాగ పూజలు ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. ఎల్లెల్సీ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి, సతీమణి శోభా రామిరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బెల్డోణ రామశాస్త్రి చేతుల మీదుగా వరుణయాగ పూజలు జరిగాయి. ఆదివారం ముగింపు పూజలకు టీబీ బోర్డు ఉన్నతాధికారులు, ఎల్లెల్సీ ఎస్‌డీఓలు, ఆంధ్రా, కర్ణాటక సెక్షన్ ఆఫీసర్లు, రైతు సంఘం నాయకులు, దేవరగట్టు ఆలయ కమిటీ సభ్యులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా పూర్ణాహుతితో పాటు గంగిపూజ, ఇతర ప్రత్యేక పూజలు జరిగాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు ఆనందంగా ఉండాలని వరుణయాగ పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి తెలిపారు. భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాల పంపిణీ చేపట్టారు.

అతిసారతోనే పిల్లల మరణాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న డీపీహెచ్ఎన్ ఇందిర తదితరులు

కర్నూలు(హాస్పిటల్): పిల్లల మరణానికి అతిసార వ్యాధే ప్రధాన కారణమవుతుందని డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి ఇందిర చెప్పారు. మహిళా ప్రాంగణంలో జరుగుతున్న ఆశాల శిక్షణ కార్యక్రమంలో ఆదివారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లల్లో సంభవిస్తున్న మరణాలకు నీళ్ల విరేచనాలు కూడా ఓ ముఖ్యకారణం కావడంతో నీళ్ల విరేచనాలు, ప్రమాదకర లక్షణాలు, ఓఆర్ఎస్ కలుపుకునే విధానం, ఓఆర్ఎస్ తాగించే విధానం, చేతులు శుభ్రపరుచుకోవడం మొదలైన విషయాలపై తల్లులకు అవగాహన కల్పించాలని కోరారు. నీళ్ల విరేచనాల సమయంలోనూ, విరేచనాల అనంతరం తల్లిపాలు, అనుబంధ ఆహార పదార్థాలు ఇవ్వాలని సూచించారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని చెప్పారు. బిడ్డకు ఆహారం తినిపించే ముందు, వంట చేయడానికి ముందు, మలమూత్ర విసర్జన తీసివేసిన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని తెలిపారు.

ఉషూ జట్టు ఎంపిక



ఉషూ జట్టు ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఉషూ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్

కర్నూలు(రూరల్): నగరంలోని పెద్ద మార్కెట్ బాలికల పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి సబ్ జూనియర్, జూనియర్ ఉషూ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఉషూ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. పోటీలకు 60 మంది హాజరయ్యారని, మంచి ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 15,16 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉషూ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, శిక్షకులు చిన్న శ్రీను, క్రాంతి, సూర్య తదితరులు పాల్గొన్నారు.